

# ఎందుకే నీకింత తొందరా...

## - బలభద్రపాత్రుని రమణి



### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
### బహుమతి పొందిన ఉత్తమ నవల
### (గత సంచిక తరువాయి)

**"నోరు మూసుకుని** నీ గదిలోకి పోవే. ఆయన బి.పి ఎక్కువైపోతోంది" అని వసుంధర కొంపలు మునిగేట్లు ఏడవడం మొదలెట్టింది.

నాన్న ఆవేశం చల్లారలేదు. "దాన్ని నా కళ్ళముందు నుండి పొమ్మను. నాకు హార్ట్ ఎటాక్ వచ్చేట్లుంది" అని గుండె పట్టుకున్నారు.

నాకైతే చాలా భయం వేసింది. ఇంతకు ముందు ఎన్నో సినిమాల్లో వసుంధరతో కలిసి చూస్తూ చిత్తూరు నాగయ్యగారినీ, గుమ్మడిగారినీ "ఇంకా గుండె పట్టుకోలేదేం అనుకున్నాను" అని ఎగతాళిగా నవ్వాను. ఇప్పుడు ఆ స్థితిలో నా సొంత తండ్రి వుండేటప్పటికి ఏం చెయ్యాలో పాలుపోలేదు.

"పద్మనాభం అంకుల్‌కి ఫోన్ చెయ్యనా?" అడిగాను. ఆయన మా డాక్టరు, నాన్నగారి ఫ్రెండూనూ.

"ఎందుకింకా ఇక్కడే వున్నావ్?పో ఇక్కడనుండి" అన్నారు నాన్న.

వసుంధర "ఏడుకొండలవాడా... గోవిందా... వాసుదేవా..మావల్ల ఏం అపరాధం జరిగింది స్వామీ? తలనీలాలు ఇస్తానని, పదేళ్ళుగా నేను ఇవ్వనందుకా? ఈ అనుకోని ఆపదలేంటి స్వామీ" అని ఏడుస్తోంది.

"జరిగాల్సినది చూడకుండా, సినిమాల్లోలా ఇంత పెద్ద డైలాగ్స్ చెప్తావేంటీ?" అరిచాను.

నాన్నకి ముచ్చెమటలు పోస్తున్నాయి. గుండె చేత్తో నొక్కి పట్టుకున్నారు.

బామ్మ "ఏమైందే?" అంటూ లేచి వచ్చింది.

"మీ అబ్బాయికి గుండె నెప్పి అత్తయ్యా" వసుంధర పెద్దగా ఏడుస్తూ అంది.

నేను ఆగలేదు. వెంటనే బాల్కనీలోకి వెళ్ళి డాక్టర్‌గారికి ఫోన్ చేసాను.

నిజంగానే నాన్నకి స్లైట్‌గా హార్ట్ ఎటాక్ వచ్చిందట.

డాక్టర్ గారు స్టంట్ వెయ్యాలన్నారు.

అమ్మని చూసాను రాత్రినుండీ ఏమీ తినలేదు. నేను ఉదయం ఇడ్లీ పెట్టాలని ట్రై చేస్తే "ఛీ పో.. అంతా నీ వల్లే. దేవుడిలాంటి మనిషికి గుండె మీద తన్నావ్. ఎంత గారాబంగా పెంచారనీ" అంది.

"నేనెప్పుడు తన్నానూ? వై ఆర్ యూ రియాక్టింగ్ సో వియర్డ్‌లీ?" అన్నాను.

"నువ్వు కాదూ ఆయన హార్ట్ ఎటాక్‌కి కారణం? " వసుంధర నన్ను కోపంగా చూస్తూ అంది.

"నువ్వు కొలెస్ట్రాల్ ఎక్కువగా వుందని డాక్టర్ చెప్పినా వినకుండా, ఊరగాయలూ, బాగా నూనెతో వండిన టిఫిన్స్ పెట్టావు. బ్లేమ్ గేమ్ మొదలు పెడితే ఒకర్ని ఒకరు ఎన్నైనా అనుకోవచ్చు" అన్నాను కోపంగా.

వసుంధర మళ్ళీ తల మోదుకుని ఏడవడం మొదలు పెట్టింది.

ఎలా వున్నాడే గోపాలం?" అంటూ ప్రియంవద పెద్దమ్మ గొంతు వినిపించింది. ఆవిడ చెల్లెల్ని దగ్గరకి తీసుకుని ఏడుస్తోంది.

"రాత్రి బాగానే వున్నారు. డిన్నర్ అయి పేపర్ చూస్తున్నారు. ఏం దిక్కుమాలిన వార్తలు చదివారో. ఇలా గుండె పట్టుకుని విలవిలలాడారు" అని అమ్మ మొత్తం వెర్షన్ మార్చి చెపుతుంటే ఆశ్చర్యపోయాను.

స్త్రీకి తన భర్తా, తన పిల్లలూ, తన కుటుంబం వచ్చేటప్పటికి ఎంత ప్రొటెక్షన్ వచ్చేస్తుందీ?" అనిపించింది అనిపించింది.

"కార్లో జగ్గయ్యపేట దాటిన దగ్గరనుండీ నాకు కాళ్ళూ చేతులు ఆడలేదు. మరిదిని చూసినదాకా పచ్చి మంచినీళ్ళు కూడా ముట్టుకోనన్నాను. నీ పసుపు తాడు గట్టిది. అందుకే టైముకి ఆసుపత్రికి తీసుకొచ్చారు" అంది పెద్దమ్మ.

వసుంధర జరగాల్సింది ఆలోచించకుండా, నన్ను తిట్టడంలోనే వుంటే, నేనే టైముకి ఫోన్ చేసానని, నేను చెప్పలేదు. కోపాలూ, మూర్ఖత్వాలూ ఇలాంటి సందర్భాలలో ప్రాణాలు తీస్తాయని నాకు తెలుసు.

"నేను ఇంటికెళ్ళి మీ ఇద్దరికీ భోజనం పట్టుకొస్తాను" అని బయటకి వస్తుంటే, "అక్కర్లేదు. కేంటిన్ వుంది" అంది అమ్మ.

కేబ్ పిలుచుకుని ఇంటికొచ్చాను.

బామ్మ చేతిలో సుందరకాండతో, నన్ను చూడగానే లేచి వచ్చింది. ఆవిడ కళ్ళల్లో ఎంతో ఆదుర్దా. తల్లికి ఉన్న ప్రేమ బిడ్డల మీద, దేనితో పోల్చలేనిది. నేను ఆమెని దగ్గరకి తీసుకుని "ఏం కాలేదు బామ్మా! నాన్న బానే వున్నారు" అన్నాను.

"అమ్మయ్యా ఆ వెంకట రవణమూర్తికి వెయ్యి నూటపదహార్లు మనియార్డర్ చెయ్యి తల్లీ" అంది ఏడుస్తూనే.

"అదే. వెయ్యినూట పదహార్లు, తన జేబు ఖర్చుకి తక్కువై, ఆ దేవుడు మనకి ఇలాంటి కష్టాలు ఇస్తూ వుంటాడనమాట" అన్నాను.

"తప్పు. ఇలాంటప్పుడు వెటకారాలు చెయ్యకూడదు" అంది బామ్మ.

"మనుషులతో చేస్తే అర్థం చేసుకోరు. ఇంక ఆయనతోనేగా చెయ్యాలీ" అన్నాను.

రాత్రి ద్వారకకి మెసేజ్ పెట్టాను.

"కాల్‌మీ" అని.

అర్ధరాత్రి దాటేదాకా, ఏదో పుస్తకం తిరగేస్తున్నా, ఫోన్ మోగుతుందేమో అని, దాని వైపే చూస్తూ చాలాసేపు గడిపాను, మోగలేదు. ముందు రోజు రాత్రి కూడా నిద్రలేక, నిద్ర ముంచుకొస్తోంది. ఆగలేక వాట్సప్ కాల్ చేసాను. ఎన్ని రింగ్‌లొచ్చినా, అవతల నుండి నో రెస్పాన్స్.

ఏంటబ్బా అంత బిజీ.. అనుకుంటూ నిద్రలోకి జారిపోయాను.

మర్నాడంతా కూడా ద్వారక్ నుండి మెసేజ్ కానీ, కాల్ కానీ రాలేదు. యాషికకి కాల్ చేసాను. మొదట నాన్న ఆరోగ్యం సరిగ్గాలేదని చెప్పి, దానికి నేనే కారణం అని తర్వాత చెప్పాను.

"అయ్యో" అంది. తర్వాత "నేను రానా?" అంది. రమ్మన్నాను. ఫ్రెండ్స్ తప్ప పరిస్థితులు ఎవరు అర్థం చేసుకుంటారూ?

హనీష్ కాల్ చేసాడు. చాలా గాభరాగా "డాడ్‌కి ఎలా వుంది? నేను బయల్దేరనా? అమ్మ ఇప్పుడే చెప్పింది. నిన్నే నాకు ఎందుకు చెప్పలేదూ?" అని అరిచాడు. ఈ అమెరికా బ్రోస్ అందరూ అంతే. వెంటనే చెపితే మాత్రం ఏం చేస్తారు? రావాలన్నా పోవాలన్నా ఇరవై నాలుగు గంటలు. బిడ్డల్ని అమెరికా పంపే సంబరంలో తల్లితండ్రులు ఇలాంటివి ఆలోచించరు. అన్నీ శుభాలగురించే ఆలోచిస్తారు.

"ఇప్పుడు బాగానే వుందిలేరా" అన్నాను.

"అసలేమైందీ?" అడిగాడు.

మొత్తం పూసగుచ్చినట్లు చెప్పాను. "నీకు అమెరికాలో చదువుకోవాలనిపిస్తే నాకు చెప్పి, చడీ చప్పుడూ లేకుండా రావలసింది. ఈ మాటలన్నీ ఎందుకు మాట్లాడావ్? వాళ్ళకి డైజెస్ట్ కావు. దైర్ జెనరేషన్ ఈజ్  ఫార్ బి హైండ్" అన్నాడు.

"అన్నీ ఓపెన్‌గా వుండాలని అనుకుంటారా? అబద్దాలు చెప్పలేను" అన్నాను,

"పరీ గురించి చెప్పావా?" అడిగాడు.

"లేదు"

"మరీ? అర్థం చేసుకోలేరు అనుకున్నవి దాచాలిగా" అన్నాడు.

"ద్వారక ఏదీ దాచనవసరం లేదు అన్నాడు" అన్నాను.

"మంచంలో వున్న తల్లీ.. వీళ్ళ గురించి పట్టని తండ్రీ. అతనికి ఏదీ చెప్పకపోయినా నడిచిపోతుందిలే. మనకలా కాదు" అన్నాడు.

ద్వారక గురించి నా తమ్ముడు అలా తీసిపారెయడం నాకు నచ్చలేదు.

"వాళ్ళని చీకటిలో పెట్టడం నాకిష్టంలేదు" అన్నాను.

"నాన్న ఇంటికొచ్చేసాక, వేరే బాంబ్ లేవీ వాళ్ళమీద వెయ్యకుండా, ఇక్కడ కాలేజీల్లో అప్లై చెయ్యి. రెండేళ్ళు నువ్వు అమెరికాలో వుంటే వాళ్ళూ స్థిమితంగా వుంటారు. ఎవరైనా నీ పెళ్ళి గురించి అడిగితే, మా అమ్మాయి ఇప్పుడే చేసుకోదు, చదువుకుంటోంది అని చెప్తారు" అన్నాడు.

"నా భవిష్యత్తు గురించి బెంగకన్నా, సమాజం గురించి ఎక్కువ చింత అంటావ్ వీళ్ళకి" అన్నాను.

"ఇప్పుడు కొత్తగా అడుగుతావేంటి? వెళ్ళి ముప్పై ఏళ్ళు అయినా పూర్తిగా అమెరికనైజ్ అయిపోయినా, పరీ గురించి అత్తయ్యా, మావయ్యా ఈ బంధం మిత్రులకి ఏం చెప్పుకోవాలి అనేగా ఏడిచారూ?" అన్నాడు.

"సరే! వాళ్ళు ఓల్డ్ ఫ్యాషన్డ్, నీ అభిప్రాయం ఏమిటీ?" అన్నాను.

"ఐ యాం వర్రీడ్" అన్నాడు.

నాకన్నా చాలా చిన్నవాడైన తమ్ముడు కూడా నా భవిష్యత్తు గురించి వర్రీడ్. ఇదే కదా భారతీయ కుటుంబ వ్యవస్థ.

"ద్వారక మీద నమ్మకం లేకా?" అడిగాను.

"అతని గురించి పక్కన పెట్టు. మొదట అతను చెప్పే ప్రతిపదం గురించి నీకు విశ్వాసం వుందా? లేక అతన్ని పోగొట్టుకోలేక ఎలాగైనా హోల్ట్ చెయ్యడానికి అతను చెప్పినట్టల్లా చేయడానికి తయారయిపోయావా" అన్నాడు హనీష్.

"అతన్ను పోగొట్టుకోలేను" అన్నాను.

"అయితే రేపు ఒకవేళ అతను వదిలేసినా సరే తట్టుకునే శక్తి తెచ్చుకో. అప్పుడు నువ్వు ఏం చేస్తే బావుంటుందో నీకు అది చెయ్యి" అన్నాడు.

ద్వారకకి ఏది బాగుంటుందో అది పెద్దవాళ్ళకి బాగుండదు. పెద్దవాళ్ళకి ఏది బాగుంటుందో అది నాకు బావుండదు. అసలు నాకేది సూటబులో అది నాకే తెలీదు. ఈ రిడిల్ని ఎలా చేధించాలి?

ఆ రాత్రికూడా ద్వారక ఫోన్ చెయ్యలేదు.

నేను దేవకిగారి సెల్కి రింగ్ చేసాను. ఆవిడ కూడా వెంటనే, తియ్యలేదు. రెండు మూడు ప్రయత్నాల తర్వాత ఆవిడ సహాయకురాలు తీసి నేనెవరో కనుక్కుని ఆవిడకి ఇచ్చింది.

"అమ్మా రిషీ! ఎలా వున్నావ్?" ఆవిడ చాలా ప్రేమగా అడిగింది.

"నేను బాగానే వున్నాను. ద్వారక ఎక్కడవున్నాడు?" అడిగాను.

"రెండు రోజులైందమ్మా ఏదో పనివుందని లాస్ వేగాస్ వెళ్ళాడు" అందావిడ.

నాకు నాన్నగారి గురించి చెప్పడం ఇష్టంలేక "కాల్ చేస్తే నేను చేసానని చెప్పండి" అని పెట్టేసాను.

యాషిక వచ్చింది. దాన్ని చూస్తే చాలా ధైర్యం వచ్చింది. మనం మొత్తం బుర్రలో పేరుకుపోయిన బూజు అంతా దులిపెయ్యాలంటే, ఇలాంటి ఆప్తమిత్రురాలు లేదా మిత్రుడూ ఒకరు కావాలి.

యాషీ కాఫీ కలిపి తెచ్చి నా చేతికిచ్చి, తనూ తీసుకుని వచ్చి కూర్చుని" ఇంతకీ ఈ అదిగో ద్వారక.. ఆలమందలవిగో.. అన్నట్లు ఎంత దూరంలోవున్నాడంటావ్?" అంది.

"తెలీడంలేదు. నాన్న ఈ రోజు మధ్యాహ్నం డిస్చార్జ్ అయి ఇంటికి వస్తున్నారు . ఆయనకి చెప్పడానికి నా దగ్గర ఏ సమాధానం లేదు" అన్నాను.

ఆమె కాఫీ సిప్ చేస్తూ మౌనంగా వుంది.

నేను బయట బోగన్ విల్లా పూల గుత్తులనీ, వాటిమీద ఝుం....ఝుం... అని ఎగిరే తుమ్మెదనీ చూస్తూ కాసేపు గడిపాను.

మాటలు భరించరానివిగా, మౌనం దుస్సాహంగా వున్న సమయం. మాటిమాటికీ ఫోన్ వైపే చూస్తున్నాను. మన డే టైం. అతనికి రాత్రి కాబట్టి, తప్పకుండా చేస్తాడనే ఆశ. దేవకిగారు కూడా చెప్పి వుంటారు.

చాలా సేపటి తర్వాత యాషీ అంది "అతన్ని నమ్మడానికి నీ దగ్గర ఏం వాదన వుంది?" అని.

ఎవరో చెంపమీద కొట్టినట్లయింది.

ఒక మనిషిని ప్రేమించడానికీ, నమ్మడానికీ నా దగ్గర ఏం ఆధారాలుండాలీ?

"అందంగా వున్నాడూ, ఆస్తి పరుడూ, మాటకారీ, ఒక ఫ్లయిట్‌లో పరిచయం, పడకవరకూ ప్రయాణం.. అతని వాగ్దానాలతో ఎక్కడా పెళ్ళి చేసుకుంటాననీ, జీవితకాలం పాటు తోడుగా వుంటాననీ లేదు. పిల్లాడు పుడితే పెంచుకుందాం అన్నమాట తప్ప. అసలు ఇంతకీ" అని అనుమానంగా ఆపేసింది.

"ఏంటీ?" అన్నాను.

"జాగ్రత్త పడ్డారా?" నా కడుపు వేపే చూస్తూ అడిగింది.

భయం వెన్నులో పాకడం అంటారే జరజరా అలాంటి ఫీలింగ్ కలిగింది.

"పదిహేను రోజులే అయింది" కడుపు వైపే చూసుకుంటూ అన్నాను.

"అంటే? జాగ్రత్త పడలేదా?" యాషీ అరిచింది.

"ఏవిటే? ఏవైంది?" బామ్మ రామకోటి రాస్తూ, మా వైపు తల తిప్పి అడిగింది.

"మునిమనవడిని ఎత్తుకోవాలన్న మీ కోరిక మీ మనవరాలు తీర్చబోతోంది. రామకోటి ఫలం పొందబోతున్నారు" అని నాకు మాత్రమే వినిపించేట్లు హేళనగా అంది యాషీ.

"ష్... ఏవిటా మాటలు?" కోపంగా అన్నాను.

"పెళ్ళి కాకుండా కలిసుంటాం అంటే మీ నాన్న స్టంట్ మాస్టర్ అయ్యారు. సారీ అంతపని అయింది. ఇంక పెళ్ళి కాకుండానే నువ్వు తల్లివి అయితే ఏమౌతారు?" అడిగింది.

నాకు నోట మాట రాలేదు.

భయమో బాధో దీనికంతా కారణం అయిన వ్యక్తి మీద కోపమోకానీ 'ఛీ' అని గోడని గుప్పెట బిగించి కొట్టాను.

"ఏంటది?" యాషి నా చేతిని పట్టుకుంది. లేదంటే మళ్ళీ మళ్ళీ కొట్టేదాన్ని.

"మనిషి రెండు రోజులు అయింది. అజాపజాలేదు. ఎటు పోతే అటే. తాడూ బొంగరం లేదు. తల్లికీ చెప్పలేదు" అన్నాను.

ఏడవకుండా వుండడానికి కన్నీళ్ళు బిగబట్టి విశ్వప్రయత్నం చేస్తున్నాను.

"అతనికి నీతోగాకుండా వేరే ఇంకెవరైనా అమ్మాయిలతో పరిచయం వుందన్న అనుమానం కలుగుతోందా" అంది నా మైండ్ చదివినట్లు.

నాకు లేపాక్షితో ఫ్లయిట్‌లో అతను ఫ్లర్ట్ చెయ్యడం గుర్తొచ్చింది.

"తెలీదు. కానీ అమ్మాయిలని సులభంగా పడెయ్యగలడు" అన్నాను.

"నీకు ప్రబంధ్ గుర్తున్నాడా? అదే డాక్టర్ ప్రబంధ్.. నిను చూడక నేనుండలేనూ అంటూ ఒక రాత్రంతా సంగీత విభావరితో నిను గాఢంగా ప్రేమిచేసిన డాక్టర్" అంది.

గుర్తొచ్చాడు.

బింకంగా "అతనికీ ద్వారకకీ ఏవిటి పోలిక?" అన్నాను.

"కనీసం అతని గురించి రెండో రోజైనా తెలిసింది. అతనూ దాచాలని అనుకోలేదు. అతనూ నిన్ను పెళ్ళి చేసుకోకుండా, జీవితకాలం పాటు ప్రేయసి స్థానంలోనే నిలుపుకోవాలి. ఈ వివాహ వ్యవస్థకి అతీతంగా అనుకున్నాడు. ద్వారకా అదే ప్రతిపాదించాడు. మగవాడికి కావల్సింది సేమ్ అయినప్పుడు పోలిక ఎందుకు లేదూ, ఇతను ఏ విధంగా బెటర్?" అంది.

యాషిక ఇంత ఆలోచించి మాట్లాడుతుందని నేను అనుకోలేదు. నిజమే మగవాడిగా అతనూ తనపెళ్ళానికి తెలీకుండా, నా నుండి ఇదే ఆశించాడు. ద్వారక కొంచెం ముందుకి వెళ్ళి, బిడ్డని కన్నాకూడా, మనం పెంచుకుందాం అన్నాడు. పెళ్ళి మాత్రం వద్దు. డాక్టర్‌కి ఆల్రెడీ పెళ్ళయింది. అందుకే వద్దు. మరి ద్వారకకి తెలీకుండా ఇంకో ఫ్యామిలీ వుందా?

తల పగిలిపోతున్నట్లుగా అనిపించింది.

కొంచెం ముందుకి తూలాను.

యాషీ పట్టుకుంది "ఐ యాం సారీ. నాకు అతనెందుకో గుర్తొచ్చాడు. అనవసరంగా గుర్తు చేసాను" అంది.

"కొంచెం బయటకెళ్ళి ఓడ్కా తాగుదామా?" అడిగాను.

"సారీ.. సంతోషంలో వున్నప్పుడు తాగితే ఫరవాలేదు. బాధలో వున్నప్పుడు తాగితే దేవదాసులా అవుతావ్"అంది.

"ఈ ప్రశ్నలన్నింటికీ పరిష్కారం ద్వారక ఫోన్ చేస్తే కానీ దొరకదు" అన్నాను.

"ఏ కంపెనీలో పని చేస్తాడు? ఏం చేస్తాడు? అతని సర్కిల్ ఏమిటి? ఏవైనా తెలుసా? అందుకు కాదూ మన తల్లితండ్రులు మనని ఫూల్స్‌లా చూసేదీ? వాళ్ళే రైట్ అని ప్రూవ్ చేస్తుంటాం" అంది.

'అతని సర్కిల్ ' అన్నమాట దగ్గర ఆగాను..

"ధీరజ్ అతనికి మంచి ఫ్రెండ్" అన్నాను.

"వెరీగుడ్! ధీరజ్‌కి కాల్ చెయ్యి" అంది.

ధీరజ్ నా కాల్ తియ్యలేదు.

"మళ్ళీ పరీ గురించే అనుకుని ఉంటాడు" అన్నాను.

"అతని ప్రేమకాదు ఈసారి గోదాట్లో మునిగేది నీ ప్రేమ అని చెప్పు" అంది యాషి.

మధ్యాహ్నం నాన్నని ఇంటికి తీసుకొచ్చాం. నాకెంతో గిల్టీగా వుంది. అమ్మ నాతో ఇదివరకటిలా మాట్లాడటంలేదు. ముభావంగా వుంటోంది. ప్రియంవద పెద్దమ్మ అమ్మకి వంటలో సాయం చేస్తోంది.

"ఎంతైనా తల్లి తోడూ అన్నారు. నువ్వు రాబట్టి నాకు ధైర్యంగా వుంది"అమ్మ కళ్ళనీళ్ళు పెట్టుకుంది. అంత పెద్ద అపోలో ఆసుపత్రీ. గొప్ప డాక్టర్‌గారూ, ఇంటికీ ఆసుపత్రికీ గిలకలా తిరుగుతున్న నేనూ ఏవీ ధైర్యం ఇవ్వలేకపోయాయి అమ్మకి. భుజం మీద తల పెట్టుకుని ఏడవనిచ్చిన పెద్దమ్మ తప్ప. హనీష్ కాకుండా ఓ ఆడపిల్ల పుట్టివుంటే నా తర్వాతకూడా బాగుండేది అనుకున్నాను.

యాషిక నేను ఫోన్ పట్టుకున్నప్పుడల్లా 'అతనేనా?' అన్నట్లు సైగ చెయ్యడం, నేను కాదనడం, అలా ఇంకో రోజు గడిచిపోయింది.

ధీరజ్ సాయంత్రం ఫోన్ చేసాడు. "ఏవైందీ? తాతయ్య కొంచెం గాభరా చేసారు బి.పి ఎక్కువై. ఇప్పుడు బాగానే వున్నారులే" అన్నాడు.

"ధీరజ్... ద్వారక.. ద్వారకానందన్" మాట పూర్తి చెయ్యలేకపోయాను. ఏడుపొచ్చేస్తోంది. కానీ నొక్కి పట్టాను. నాకు చిన్నప్పటినుండీ ఏడవడం అంటే గొప్ప అసహ్యం.

"ద్వారకకి ఏమైందీ?" కంగారుగా అడిగాడు.

"అదే తెలీడంలేదు. ఫోన్ తియ్యడంలేదు. ఈలోగా నాన్నగారికి హార్ట్ ఎటాక్ వచ్చింది" అంటూ ఇంట్లో జరిగినదంతా చెప్పేసాను.

"ఐ యాం సో సారీ. నేను ఫోన్ తియ్యనందుకు. ఇప్పుడు మీ నాన్న బాగానే వున్నారుగా?" అన్నాడు.

"ఆ.. ఇంటికొచ్చారు. కానీ ద్వారక ఎక్కడికి వెళ్ళుంటాడంటావ్? నా ఫోన్ తియ్యడం లేదు?"అన్నాను.

"ఆంటీకి ఫోన్ చేసి కనుక్కుంటా" అన్నాడు.

"ఆ ప్రయత్నం కూడా చేసా. ఆవిడ లాస్ వేగాస్ వెళ్ళాడు బిజినెస్ పనిమీద అన్నారు గానీ అతను వాట్సప్ మెసేజెస్ ఎందుకు చూడడం లేదో అర్ధం అవడంలేదు" అన్నాను.

ద్వారకని బ్లేమ్ చెయ్యాలని వంటిలోని ప్రతి నరం తొందరపడినా, నా నోట్లోంచి ఒక్కమాట  కూడా రాలేదు.

"అతనికి ఏమీ అయివుండదు కదా" అన్నాను.

ధీరజ్ నవ్వి "అతనికి ఏమీ అవదు. మొదటినుండీ ఇతనంతే" అన్నాడు.

"ఎంత?" అడిగాను అర్ధంకాక.

"ప్రేమలూ, పెళ్ళీ, బంధం అన్న విషయాల్లో బంధించబడకూడదని చెప్తుంటాడు. ఒకరి జీవితం ఇంకొకరి జీవితంతో ముడిపెట్టుకోడం బుద్ధిలేని పని అని అతని ఉద్దేశం" అన్నాడు.

"నన్ను ప్రేమించాను అన్నాడుగా" చాలా శుష్క స్వరంతో అన్నాను.

"అందులో డౌట్ ఏం లేదు. నీ ప్రేమకీ అతని ప్రేమకీ డెఫినెషన్‌లు వేరు" అన్నాడు.

"అవసరానికి ఫోన్ తియ్యని వాడిని నమ్మి నేను తల్లీ తండ్రీ వున్న ఊరు, దేశం వదిలి అమెరికా ఎలా వెళ్ళాలి?" దిక్కు తోచనట్లు అన్నాను.

"బంధించేవి బంధాలు అని దూరంగా వుంటాననీ, ఎవరితో అందుకే ప్రేమలో పడలేదనీ అతను నాతో చాలాసార్లు చెప్పాడు. నీ విషయంలో అలా కాకపోవచ్చు. నీకు ఫోన్ చేసి తను ఎందుకు ఫోన్ తియ్యలేదో, మెసేజ్‌లు ఎందుకు చూడలేదో చెప్తాడేమో. ఇంకో రెండు రోజులు చూద్దాం. నేను కూడా ట్రై చేస్తాను" అన్నాడు ధీరజ్.

ధీరజ్ ఆ నిమిషంలో నాకు పెద్దన్నలా అనిపించాడు. పరిమళ అదృష్టవంతురాలు. ఆమె చెయ్యి జారిపోతుందేమోనని ధీరజ్ ఎంత బాధపడ్డాడు. ఆమె ప్రేమని శాశ్వతంగా పొందాలని ఎంతగా తపన పడ్డాడూ? పరీ ఇంత మంచివాడిని ఎంతగా బాధ పెట్టిందీ? అదేవిటో దురదృష్టం మంచి వాళ్ళకి ఇలాటి తలతిక్కగాళ్ళు దొరుకుతారు. ధీరజ్‌లాంటి స్ట్రెయిట్ పర్సన్స్‌కి అలాంటివాళ్ళు.

"అమ్మా నాన్నలు రేపో మాపో మనసు మార్చుకుని అతన్ని పిలు మాట్లాడదాం అంటే, గాలివాటం మనిషి ఎటు పోయాడో కానీ తెలీడం లేదు అని చెప్పాలా?" బాధగా అన్నాను.

"ఓ పని చెయ్యి"

"ఏవిటీ?" ఆశగా అడిగాను.

"నిద్రపోడానికి ప్రయత్నించు. రెస్టిల్ వుందా ఇంట్లో?" అడిగాడు.

"నిద్రపోతే?" అడిగాను.

"తెల్లారుతుంది."

"ఔనా? చాలా పెద్ద జీవిత సత్యం తెలిసింది" వ్యంగ్యంగా అన్నాను.

"తెల్లారిన తర్వాత నీ రోజు మామూలుగానే మొదలవుతుంది. సూర్యుడు తూరుపునే ఉదయిస్తాడు అన్నీ మామూలుగానే జరుగుతాయి. నిన్ను ఉరికంబం ఎక్కించడానికి ఎవరూ నీ గుమ్మంలో తాళ్ళు పట్టుకుని ఎదురు చూస్తూ వుండరు. ఈ విషయం తెలీక చాలామంది ఆ రాత్రిని గడపలేక, ఓపికి లేక ఆత్మహత్యలు చేసుకుంటారు. లోకంలో మన వల్ల వేరొకరికిగానీ, వేరొకరి వల్ల మనకి కానీ ఏమీ మునిగిపోదు. మామూలుగా తెల్లవారుతుంది. దట్స్ ఇట్" అన్నాడు.

ఇంత మోటివేషనల్ స్పీకర్ కూడా, తన ప్రేమ ఫెయిల్ అయినప్పుడు ఎంతగా బాధపడ్డాడో నాకు తెలుసు.

"ఓకే. థాంక్స్ ఫర్ కాలింగ్" అన్నాను.

"అంకుల్ జాగ్రత్త. ఆయన దగ్గర కూర్చుని కాసేపు ఏదో ఒకటి మాట్లాడు. వాతావరణం గురించో, క్రికెట్ గురించో, లేదా పాత సినిమాల గురించో.. తండ్రి విలువ నాకు బాగా తెలుసు. " అన్నాడు.

"చేస్తాను. థాంక్స్ ఎగైన్" అన్నాను.

ధీరజ్ ఫోన్ పెట్టేసాక యాషీ నా దగ్గరకొచ్చింది. "నైనా ఇంటికి వెళ్దామా?" అడిగింది.

మందు కొట్టొచ్చన్న అభిప్రాయం నాకు అర్థం అయింది.

"నో మోర్ ఎస్కేపిజం. ఏదయినా ఎదుర్కొంటాను" అన్నాను.

"అయితే కాఫీ పెట్టనా?" అడిగింది.

"ఇంకా కొంచెం సేపు ఆగు. తెల్లారాక తాగుదాం. ముందు ముఖ్యంగా చెయ్యాల్సిన పని ఒకటి వుంది" అన్నాను.

"ఏంటదీ?" అంది.

"నాన్నతో ఇవాళంతా మాట్లడలేదు. వెళ్ళి గుడ్‌నైట్ చెప్పి వస్తాను" అన్నాను.

అది నవ్వింది.

ఘనీభవించిన నిశ్శబ్దం పగలగొట్టడానికి ఎంత బరువైన సుత్తి అయినా సరిపోదు.

నాన్నతో మాట్లాడాలని వచ్చాను కానీ, ఆయనకళ్ళు మూసుకుని పడుకుని వుంటే 'నాన్నా' అన్న రెండు అక్షరాలు ఎలా పలకాలో తెలియలేదు. చిన్నప్పటినుండీ ఎంతో సొంతమైన అక్షరాలు... గునుస్తూ, ప్రేమగా, సాధిస్తూ విసుక్కుంటూ పలికిన అక్షరాలు.

నాకోసం యముని వాకిలిదాకా వెళ్ళి మహిష లోహపు గంటని విని, తిరిగి నాకోసం వెనక్కి వచ్చిన నా పిచ్చి తండ్రి. ఏనాడూ అమెరికా చూడాలన్న కోరిక గానీ, మేం లేకుండా ఓ ప్లెజర్ ట్రిప్పుకానీ, అంతెందుకు హోటల్‌కి ఒక్కరూ వెళ్ళని మధ్య తరగతి త్యాగశీలి నా తండ్రి. ఎంతసేపూ మమ్మల్ని వెనకేసుకొచ్చి వసుంధరతో దెబ్బలాడే నా తండ్రి ఇప్పుడు

కనురెప్పలు మూసుకుని పడుకుని వుంటే ఆ కనురెప్పల కింద వేదన, శస్త్ర చికిత్సల వల్ల కాదు. కూతురి జీవితం ఏమైపోతుందో అన్న బాధవల్ల అని నాకు తెలుసు.

మాటలు కొరవడినప్పుడు ఓ చర్యచాలు. ఆయన కాళ్ళమీద అరచేతిని వేసాను.

ఆయన కళ్ళు తెరిచారు.

"నాన్నా.. నెప్పిగా వుందా?" అడిగాను.

"లేదు" ఎప్పటిలాగే అబద్ధం చెప్పారు.

ఆయన బలహీనమైన గుండె మీద నేను చాలా పెద్ద దెబ్బ కొట్టాను. ఈ సమాజం బంధువులూ పక్కింటివాళ్ళూ ఏమనుకుంటారో అని భయపడే నా అమాయకపు తండ్రి పాపం.

"ఐ యాం సారీ నాన్నా" అన్నాను.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS